# అక్క - బావ

కౌశికసు

అక్కయ్యగారు ఆ రోజు చాలా పసందుగా పూరీలు - అందులోకి బంగాళాదుంపలు - ఉల్లిపాయలు కలిపి హోటల్లోలాగా - కూరచేసింది. బావగారూ - నేను - పిల్లలు - టిఫిను చేస్తున్నాం - సరదాగా గార్డెనులో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ.

ఉదయంపూట లేతఎండకు గులాబీల మీదపడి ఆగిపోయిన మంచుబిందువులు ముత్యాల్లా మెరిసిపోతున్నాయ్. తెల్లవారి చాలాసేపైనా పారిజాతప్పూల తాలూకు కమ్మని - సన్నని - సున్నితమైన వాసన ఇంకా ఉంటూ ఉండి ఆనందాన్ని కలిగిస్తూనే ఉంది. ఆ ఇంటి ప్రాంగణంలోనేఉన్న తోటలోనుంచి వస్తున్న చల్లగాలులు శరీరానికి తగిలి అనిర్వచనీయమైన ఆనందాన్ని కలిగిస్తూనే ఉన్నాయి.

రంగురంగుల గార్డెను కుర్చీల్లో కూర్చుని టీపాయ్‌మీద పెట్టుకొని టిఫిను తింటున్న మేము కబుర్లలోపడ్డాం.

నేను విజయవాడనుండి హైద్రాబాదు వచ్చినప్పుడల్లా అక్కయ్యగారింట్లో నాకోసరం ప్రత్యేకమైన వంటకాలు చేయించడం, మా బావగారు దగ్గరుండి కొసరి కొసరి వడ్డింపించి ఆనందించడం మామూలే.

అక్కయ్యగారంటే మా తోబుట్టువు కాకపోయినా - వారు హైద్రాబాదు కొత్తగా వచ్చినప్పుడు వారి కుటుంబం మా కుటుంబం - పాలూ నీళ్ళలా కలిసిపోయాయి ప్రసాద్ బావగారు అతికొద్ది కాలంలోనే మాకు చాలా ఆప్తులైపోయారు. మా ఇంట్లో అవసరాలు నాకంటే ముందుగా మా ప్రసాద్‌బావగారికే తెలిసిపోయేవి.

రెండో ఆట సినిమా చూసొచ్చి - అప్పుడు ఆ మధ్యరాత్రి కాఫీలు కలుపుకొని - మా రెండు కుటుంబాలు - పారిజాతపు చెట్టుక్రింద కూర్చొని - కాఫీ త్రాగుతూ - వెన్నెల్లో తెల్లవారుఝామున మూడుగంటలదాకా కబుర్లుచెప్పుకుంటూ కూర్చున్న మధురమైన సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి.

ఆ తరవాత ఉద్యోగరీత్యా నాకు విజయవాడ ట్రాన్స్ఫరు కావడం - వారు మేముంటూన్న పోర్షన్లోకి మారడం - దరిమిలా మేము విజయవాడవెళ్లిపోవడం అప్పుడప్పుడు మమ్మల్ని చూడ్డానికి వాళ్ళు విజయవాడ రావడం - వాళ్ళను చూడ్డానికి మేము హైద్రాబాదు పోవడం

ఇవన్నీ మామూలుగా జరిగిపోతూనే ఉన్నాయి.

మా స్నేహం బాగా గట్టిపడడానికి - మా రెండు కుటుంబాలు ఆర్థికంగా ఒకే స్థాయిలో ఉండడం - మా అభిరుచులు ఒకే రకంగా ఉండడం. సరదాలు - పెళ్లిళ్ళు - పండగలు - అన్నీ కలిసి జరుపుకోవడం బహుశా కారణాలు కావచ్చు.

ఇక్కడ మా బావగారి అభిరుచుల గురించి కొంచెం చెప్పాలి.

ఆయనకి తాను తినడంకన్నా - ఇతరులకు పెట్టడంలో ఎక్కువ ఆనందం ఉంది ఆహారపుష్టి గలవాళ్ళు తృప్తిగా భోజనం చేస్తుంటే-వాళ్ళకు కొసరి కొసరి పదార్థాలు వడ్డింపిస్తూ దగ్గరుండి-పెట్టించి ఆనందించేవారు.

ఆయనకు భోజనంమీద ఉన్న శ్రద్ధ చూస్తూంటే కొత్తలో ఎంతో ఆశ్చర్యం వేసేది. కొబ్బరికాయ - మామిడికాయ కలిపి ఎలా రుచిగా పచ్చడిచేయవచ్చో - పనసకూర ఎలా వండాలో - నువ్వులు దగ్గరుండి పట్టించి - వచ్చిన పిండితో కూర వండించుకొని - దాంట్లోకి పులుసు నంచుకుంటే ఎలా రుచిగా ఉంటుందో చెబుతూంటే ఆయన పొందే తన్మయత్వం - ఆ వివరణ - ఆ తాదాత్మ్యం చూడాల్సిందేగాని చెబితే తీరేదికాదు.

ఇంతచేసి ఆయనకు తిండిమీద అంత ప్రేమఉన్నా - తృప్తిగా తినే భాగ్యం మాత్రం ఆయనకు భగవంతుడివ్వలేదు. రోజూ ఫ్యాక్టరీకి వెళ్ళివచ్చి- అక్కయ్యగారు ఆయన్ను బతిమిలాడుతూ-చంటి పిల్లవానికిఅడిగిఅడిగి వడ్డించినట్లువడ్డిస్తే- ఏ రాత్రి పదిగంటలకో ఒక ముద్ద తిని భోజనం అయిపోయిందనిపించేవారు. ఆమె ఆయన ప్రక్కన కూర్చొని- ఇది వేసుకోండి- అది వేసుకొండి అని కొసరి కొసరి వడ్డించి - ఆయనచేత తినిపిస్తూ ఉంటే చూడ్డానికి నాకు భలే సరదాగా ఉంటూంది.

ఆయన తిండిమాట ఎలా ఉన్నా - ఇతరులకు ఆతిధ్య మివ్వడంలో ఆయనకు ఆయనే సాటి.

మంచి మామిడిపండ్లకోసరం - ఐదు మైళ్ళు సైకిలు తొక్కుకుంటూ వెళ్ళి - అందరూ మూడు రూపాయలు కిలో చొప్పున కొంటూంటే - తాను ఐదు రూపాయిలిచ్చి మంచి మంచి పండ్లు తనకు తృప్తికలిగేలా ఏరి - తీసొక్కొచ్చి నా విస్తర్లో వేసేస్తూ - "శర్మగారూ! ఎలా ఉన్నాయంటారు మామిడిపళ్ళు" అని అడిగి -

"చాలా బ్రహ్మాండంగా ఉన్నాయండి- ఇంత మంచి పండ్లు మీకెక్కడ దొరికాయండి" అని నేనంటే తృప్తిగా నవ్వుకొని -

"చూశారా! మీ కిష్టమని ఎంత మంచి పళ్ళుతెచ్చానో" అంటూ మురిసిపోయేవారు.



పదార్థాల ధరలు మండిపోతూన్న ఈ రోజుల్లో- భోజనం గురించి అంత శ్రద్ధవహించి- దాన్ని ఒక ప్రత్యేకమైన సబ్జెక్టుగా తీసుకొని ఇతరులకు పెట్టి ఆనందించే మా మావగారిలాంటి వాళ్ళు బహుశా చాలా అరుదుగానే ఉంటారేమో!

నేను కాస్త భోజన ప్రియుణ్ణే- చెప్పొద్దూ- తృప్తిగా తినడమే నాకు తెలుసుగాని- మంచి పళ్ళు- ఊరగాయలు సెలెక్టుచేయడం- అంత శ్రద్ధగా వండించడం- వాటికోసం అంత సమయాన్ని- డబ్బును వెచ్చించడం నావల్ల అయ్యేపని

కాదు. ఈ విషయంలో ప్రసాదుగారి మనస్తత్వానికి-నా మనస్తత్వానికి ఎక్కడా పోలిక లేదు.

ఈ ఒక్క విషయంలోనే కాదు- మరెన్నో విషయాల్లో నాకూ-ఆయనకు వైవిధ్యం ఉంది. ఆయన ప్రతి విషయాన్ని కుండ బద్దలుకొట్టినట్లు చెప్పేవారు. నేను- నా మనసులో ఉన్న విషయాన్ని కూడా బయటపెడితే ఎవరేమనుకుంటారో అని- అభిమానపడి - నాలోని భావాలను నేనే అణచుకొని-పేలవంగా ఒక నవ్వు నవ్వి ఊరుకొనేవాణ్ణి.

ఆయనకు వయస్సు అరవయ్యో పడిలో పడ్డా- ఆరోగ్యం అంత సజావుగా లేకపోయినా - చాలా చురుగ్గా ఉంటారు. తన ఒంట్లో ఎంత బడలిగ్గా ఉన్నా - ఆరోగ్యం బాగాలేకపోయినా ఆ విషయం ఆయన ఒప్పుకొనేవారు కాదు.

"మీ ఒంట్లో నలతగా ఉందాండి?" అంటే, "అబ్బే- అలాంటిదేమీ లేదే- నాకేం బ్రహ్మాండంగా ఉన్నాను." అని కొట్టిపారేసేవారు.

కాని ఆయన ఒంట్లో నలతగా ఉందన్న నా అనుమానం నిజమైనదేనని -తరువాత మా అక్కగారి ద్వారా రూఢి అయ్యేది.

ఆయనకు అరవై ఏళ్ళు - ఆమెకు నలభై అయిదు వచ్చినా- ఇప్పటికీ ఆ ఇంట్లో ఆయనమాట చలామణి కావల్సిందే.

ఆయన గుడ్లెఱ్ఱచేస్తే - ఇంట్లోవాళ్ళందరూ - ఎక్కడివాళ్ళక్కడ గప్‌చిప్ సంబాళుబుడ్డి.

అంటే- ఇంట్లో పురుషుని అధికారానికి-గౌరవం-భయం- ఉన్న తరంవాళ్ళు ఆ దంపతులు.

మరి ఈనాడో - అలా కాదు.

ఇంతెందుకూ - మా కుటుంబమే తీసుకోండి. మా ఇంట్లో అంతా డెమాక్రసీయే. చివరకు మా చిన్నవాడు కూడా నన్నెదిరించి మాట్లాడతాడు. ఎదిరించడమంటే మరేం కాదు. వాడి అభిప్రాయాన్ని వాడు నిక్కచ్చిగా - నిర్మొహమాటంగా - నా కిష్టంలేకపోయినా-ఖచ్చితంగా చెప్పేస్తాడు.

ఒక్కమాటలో చెప్పాలంటే - నేటి ప్రజాప్రభుత్వంలోలా- ఇలాంటి భావస్వాతంత్ర్యం మా ఇంట్లో ఉందన్నమాట.

అదే విషయాన్ని మరో మాటల్లో చెప్పాలంటే- పురుషుని అధికారానికి- కుటుంబంలో అంత ప్రత్యేకతేమీ లేదన్నమాట.

ఇంట్లో భార్యా-బిడ్డల మాట ఎలాగో -నా మాట కూడా అంతే- ఏవో కొన్ని ముఖ్యమైన విషయాల్లో తప్ప.

"బంగాళాదుంపల కూర, మరి కొంచెం వడ్డించమంటారా" అన్న అక్కయ్యగారి పలకరింపుతో-నా భావనా

ప్రపంచంలోనుండి కదలి వాస్తవిక ప్రపంచంలోకి వచ్చాను. అప్పటికే నా పళ్ళెంలో కూర ఐపోయి వట్టి పూరీలే తింటున్నట్లున్నాను.

"కొంచెం కూర వడ్డించండి" అన్నాను

"పూరీల కూర ఇలాగేనా వండేది. ఇంకా పోపు సరిగా అంటలేదు" అని చిరుతగాదాకు నాంది పలికారు మా బావగారు.

తగాదా అంటే తగాదా కాదనుకోండి అది ఓ చిన్నపాటి వాగ్వాదం లాంటిది.

భార్యాభర్తలకు ఇలాంటి చిన్నచిన్న తగాదాలు రావడం - అవి ఇట్టే మాసి పోవడం కూడా పరిపాటే.

అందునా- మా అక్కయ్యా-బావగారి విషయంలో మరీనూ.

అంచేత నేనేమో భార్యాభర్తల తగాదాలు-అద్దంమీద పెసరగింజ లాంటివి అనేది మా ప్రక్కింటి బామ్మగారు.

అక్కయ్యా - బావగారల మధ్య ఎప్పుడు చిరుతగాయిదాలు వస్తాయో- ఎందుకొస్తాయో - ఎంతసేపుంటాయో- చెప్పడం చాలా కష్టం.

నడివేసవిలో వర్షంరావడం లాంటిది. నడిఎండల్లో వర్షం వస్తుందని ఎవర మైనా ఊహించగలమా?

అయినా అప్పటికప్పుడు సుడిగాలి లేచి - మబ్బుపట్టి - ఒక జల్లు పడిపోవడం- మనకు తెలియని విషయమేమీ కాదు.

ఇదిగో ఇదీ అలాంటిదే.

ఈసారి కూడా మా బావగారే మొద లెట్టారు.

"శర్మగారూ! ఇప్పుడు మనమంటే ఇంట్లో పూర్తిగా లెఖ్ఖలేకుండాపోయింది. మన మాటంటే ఇంట్లో ఎవరికీ భయ భక్తులుగాని - గౌరవాలుగాని లేకుండా పోయాయి- అదే నేను బ్రతికున్న రోజుల్లోనైతేనా"... అని ఆయన ఆగిపో యారు.

ఆయన చేసే 'నేను బ్రతికున్న రోజుల్లోనైతేనా' అనే పద ప్రయోగానికి ఒక ప్రత్యేకమైన అర్థం ఉంది.

అదేమిటంటే—

ఆయన పదేళ్ళ క్రితం ఒక పేరు పొందిన పొగాకు కంపెనీలో ఆఫీసరు ఉద్యోగం చేసేవారు. అప్పుడు ఆయన తోటిఉద్యోగులకు న్యాయంచేకూర్చడానికి - ఎన్నోసార్లు తనకంటె పెద్ద ఆఫీ సర్లతోపోట్లాడి- వాళ్ళకు న్యాయం జరిగే వరకు నిద్రపొయ్యేవారు కాదట.

అంచేత ఆ ఫ్యాక్టరీ మొత్తంలో ఆయనంటే ఎనలేని గౌరవం - అభి మానమూ ఉండేవి. ఎంతో మంది మిత్రులు ఆయన దగ్గరకువచ్చి సలహా తీసుకొనేవారు. పెద్ద పెద్ద ఆఫీసర్లుకూడా ఏదైనా గడ్డుసమస్య వచ్చినప్పుడు వీరిని సంప్రదించే ఆయన సలహా ప్రకారం నడుచుకొనేవారట.

ఇక ఇంట్లో - ఆ రోజుల్లో ఆయన

మాటంటే వేదవాక్కు.

ఆయనకు ఎదురు తిరగడానికిగాని - చివరకు ఎదురుపడ్డానికిగాని - ఇంట్లో ఎవ్వరూ సాహసించేవారు కారట.

ఇంట్లో తమ్ముళ్ళు- మరదళ్ళు-భార్య -చివరకు తల్లి - తండ్రికూడా - ఆయన మాటంటే సుగ్రీవాజ్ఞగా భావించి - గౌరవించి- తలదాల్చేవారు,

అలా అని ఆయన కుటుంబ సంక్షేమాన్ని విస్మరించి ఎప్పుడూ ప్రవర్తించలేదు

ముగ్గురు తమ్ముళ్ళకు ఉద్యోగాలు వచ్చేవరకు చదివించారు. వాళ్ళ పెళ్ళిళ్ళు చేశారు,

ఇద్దరు చెల్లెళ్ళకు - మంచి వరుళ్ళను వెదకి - పెళ్ళిళ్ళుచేసి యథాశక్తి పసుపు కుంకుమలు పెట్టి అత్తవారిళ్ళకు పంపించారు.

ఎటొచ్చీ ఆయన కోపతాపాల్ని భరించడమే కొంచెం కష్టంగా ఉండేది. అయినా ఆయనకున్న అన్ని సుగుణాల్లో - ఇది మరుగునపడిపోయేది.

ఇంటిపెద్ద అయినవాడికి ఆ మాత్రం దర్పం అవసరమేమో - అనికూడా నాకప్పుడప్పుడనిపించేది.

అలాంటి ఆయనకు ఒకసారి పెద్ద జబ్బుచేసి-ఇక బతకరని డాక్టర్లు డిక్లేరు చేశారట.

కాని ఆయన మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు - ఎంతమాత్రమూ అధైర్యపడకుండా - "నాకేమిటి - రేపివాళ్టికి ఆరోగ్యం కోలుకుంటే మళ్ళీ-ఫ్యాక్టరీకి వెళ్ళనూ-?" అనేవారట.

ఆయన అన్నట్లే జరిగింది.

డాక్టర్ల అంచనాలు తప్పాయి.

ఆయన బ్రతికారు.

బ్రతకడమేకాదు - ఆయన ఛాలెంజి చేసినట్లు ఫ్యాక్టరీకి మళ్ళీ వెళ్ళారు కూడాను.

ఆయన్ని చూసి ఫ్యాక్టరీలో సహఉద్యోగులంతా ఆశ్చర్యచకితులయ్యారట. "బ్రతకరనుకొన్న ప్రసాదుగారు బ్రతకడం ఎంత ఆశ్చర్యం" అని ముక్కుమీద వేలువేసుకొన్నారు.

కాని ఫ్యాక్టరీవాళ్ళు మాత్రం ఆయన శారీరక బలహీనతకు నొచ్చుకొని - ఓ పాతికవేలు రిటైరుమెంటు బెనిఫిట్సుక్రింద ఇచ్చి - ఇంట్లో ఉండి రెస్టు తీసోక్కమన్నారట.

కాని ఇన్నాళ్ళు ఉద్యోగంచేసి పౌరుషంగా బ్రతికిన ఆయనకు ఒళ్ళో చేతులు పెట్టుకొని ఇంట్లో కూర్చోవడం ససేమిరా నచ్చలేదు.

ఆ పాతికవేలు ఓ బ్యాంకులో వేసుకొని - మళ్ళీ ఏదో కంపెనీలో ఓ చిన్న ఉద్యోగం సంపాదించుకొని . తన పౌరుషానికి భంగంవాటిల్లకుండా ఈనాటికీ ఉద్యోగం చేస్తూనే ఉన్నారు.

ఇంతకూ చెప్పొచ్చేదేమిటంటే - "నేను బ్రతికున్న రోజుల్లో" అనేమాట

వెనక అంత చరిత్ర ఉన్నదన్నమాట.

వెంటనే అక్కయ్యగారు అందుకుంది.

"సరేలెండి. మీరు బ్రతికున్నరోజుల సంగతే చెప్పాలి."

"అన్నయ్యగారూ - అప్పుడాయన ఎలా ఉండేవారనుకుంటున్నారు. తరచు ఉగ్రనరసింహావతారం ఎత్తేవారు. ఆయన దరిదాపులకు వెళ్ళాలంటే మాకు భయంవేసేది. నేనేమిటి - చివరికి వాళ్ళమ్మగారుకూడా ఆయనతో మాట్లాడాలంటే తూచి తూచి మాట్లాడేవారు" - అంది ఆమె.

"మరీ నన్ను అంత దుర్మార్గుడిగా చిలవల - పలవలుచేసి - చిత్రించకు - 'యములాడు వీడు' అనుకుంటారు పిన్నవాళ్ళంతా" అన్నారు ఆయన ఇక భార్యను ఆపకపోతే లాభంలేదు అన్న ధోరణిలో -

"శర్మగారూ! అప్పటికిప్పటికీ రోజులే పూర్తిగా మారిపోయాయనుకోండి. ఆ రోజుల్లో ఇంట్లో మగమహారాజంటే ఎంత భయం - భక్తి - గౌరవ ప్రతిపత్తు ఉండేవనుకుంటున్నారు.

మా నాన్నగారు అంతదూరం నుంచి వస్తున్నారంటే మేము ఎక్కడివాళ్ళమక్కడ - చదివినా చదవకపోయినా - పుస్తకాలు పట్టుకొని - కుక్కినపేనుల్లా కూర్చునేవాళ్ళం - మా నాన్నగారంటే మా కంత భయభక్తులుండేవి.

భయానికి భయం ఉండేది - అపేక్షకు అపేక్ష ఉండేది.

మా నాన్నగారు - రాత్రి పన్నెండు గంటలవాకా - ఆంజనేయస్వామి గుడిలో భజనకీర్తనలు చెప్పి - భజననుండి వచ్చేటప్పుడు కొబ్బరిముక్కల ఫలహారం - చెరుకుముక్కలు - జామపళ్ళు తెచ్చి నిద్రపోతూన్న మమ్మల్ని లేపి - ఆప్యాయంగా తినిపించి మళ్ళీ పడుకోబెట్టేవారు జోకొడుతూ -

ఆ ప్రేమలూ, ఆ ఆప్యాయతలు ఇప్పుడేవి.

ఈ రోజుల్లో పిల్లలంటేనే తల్లిదండ్రులకు పట్టదు.

ఈ యాంత్రిక యుగంలో ఎవరి దారి వారిదే. ప్రక్కమీంచి లేచింది మొదలు పడుకొనే వరకు ఒకటే పరుగు.

"పిల్లలూ అంతే - ప్రతి చిన్న విషయానికి తల్లిదండ్రుల నెదిరించి మాట్లాడతారు ... గట్టిగా మందలిస్తే ఇంట్లోంచి పారిపోతారు."

"తల్లిదండ్రుల అభిమానానికి నోచుకోని పిల్లలు - పిల్లల సంరక్షణ చేయలేని తల్లిదండ్రులు - ఈ సమాజంలో మనకు కోకొల్లలుగా కన్పిస్తారు."

"ఏమైనా పిదపకాలం వచ్చిందిలెండి" అన్నారు.

ఇంతలోనే ఏదో జ్ఞాపకమొచ్చినట్లు "శర్మగారికి ఆ ఫోటో చూపించావా" అన్నారు.

అక్కయ్యగారు డ్రాయింగ్‌రూంలో తగిలించిఉన్న పాతఫోటో ఒకటి తెచ్చి నా చేతికిచ్చారు.

"ఈ ఫోటోలో ఉన్నవాళ్ళెవరో చెప్పుకోండి చూద్దాం" అన్నారు బావగారు.

"ఏమిటోనండి గుర్తుపట్టలేకపోతున్నాను", నేను అన్నాను.

"నన్ను చెప్పమంటారా" అంది అక్కయ్యగారు ఆయన పర్మిషన్ కోసరం అప్లికేషన్ పెట్టుకొన్నట్లు.

"ఊఁ చెప్పు". ఆయన పర్మిషను ఇచ్చారు.

"ఆ పొడవాటిచొక్కా తొడుక్కొని -పదహారంగుళాల ప్యాంటు తొడుక్కొని టైట్‌గా కూర్చున్నవారు - సాక్షాత్తు ఈ మీ బావగారే!"

"ఆ ప్రక్కన పొట్టిగాఉన్న జాకెటు-పూలలంగా వేసుకొని అమాయకంగా కుర్చీప్రక్కన నిల్చుని ఉంది - అలనాటి అమాయకురాలు, వినయసంపన్నురాలు అయిన ఈ మీ అక్కయ్యగారు."

"ఆ అమాయకప్పిల్లే ఈనాటి మీబావగారి దృష్టిలో 'గయ్యాళి గంగమ్మ' అని ముగించింది, ఆయనవేపే ఆసక్తిగా చూస్తూ.

ఆమె చమత్కారానికి ఆయన లోలోపలే ముసిముసి నవ్వులు నవ్వుకోవడం నే గమనించకపోలేదు.

వారి ఆ మాటల్లో-చూపుల్లో ముప్పైఐదేళ్ళ జీవితపు సాహచర్యం-చనువు-అప్యాయత - అనురాగం - భయం - ద్వేషం-సాన్నిహిత్యం- అన్నీ ఒకేసారి మెరుపు మెరిసినట్లు కన్పించాయి నాకు.

ఆ కాస్సేపటికి ఆ దంపతులు నా కళ్ళకు ఏదో కొత్తవాళ్ళలాగా - చదవని పుస్తకంలా నాకు అర్థంగాని- విడివడని ప్రశ్నార్థకంలా కన్పించారు!

వాళ్ళిద్దరు ఒకరినొకరు విసుక్కున్నా- తగాదాపడ్డా- ఒకరిని విడిచి మరొకరు ఉండలేరు. కనీసం వీధిలోకి వెళ్ళినా ఇద్దరూ కలిసి వెళ్ళాల్సిందే. ఆమె రాకపోతే ఆయన వెళ్ళరు. ఆయన రానంటే అమె కాలు బయటపెట్టదు. నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ వాళ్ళు కలిసి వెళ్ళాల్సిందే. కనీసం ఒకరినొకరు సాధించుకొంటూనైనా కలిసి బజారు కెళ్ళాల్సిందే.

దాంపత్య బంధమంటే అదేనేమో!

భార్యాభర్తల బంధం ఎంత విచిత్రమైంది. అడవిలో పుట్టిన ఉసిరికాయకు - సముద్రంలో పుట్టిన ఉప్పుకూ ఏర్పడ్డ సంబంధంలా- ఏ కుటుంబంలోనో పుట్టిన ఒక ఆడపడుచుకు - మరో కుటుంబంలో పుట్టిన అబ్బాయికీ- పెళ్ళి అనే పవిత్ర బంధంతో సంబంధం ఏర్పడుతూంది.

ఆ తరవాత వాళ్ళిద్దరూ మల్లి-మాలతిలా అల్లుకుపోవాలి. ఒకరి హావభావాలకు అనుగుణ్యంగా మరొకరు నడచుకోవాలి. ఒకళ్ళ కష్టసుఖంలో మరొకరు పాలు

పంచుకొని- పాలునీళ్ళలా కలిసిపోవాలి తల్లిదండ్రులను త్యాగంచేసి వచ్చిన ఆడపిల్ల-కుటుంబంలో అన్నదమ్ములను- అక్కచెల్లెళ్ళకంటె భార్యను మిన్నగా చూచుకొనే భర్త- ఒకరికొకరు ఆస్తి పాస్తులుగా మారిపోతారు.

అంటే దాదాపు ఇది వారిద్దరికీ పునర్జన్మలాంటి దన్నమాట.

ఎన్ననుకున్నా- ఎవరేమన్నా విడిపోనిది-విడదీయరానిది భార్యాభర్తల అనుబంధం.

నేను ఈ ఆలోచనల్లోంచి తేరుకోక ముందే- అక్కయ్యగారు లోపలికెళ్ళి తమలపాకులు - మద్రాసు సెంటెడ్ సున్నం- వక్కపొడి తీసుకొనివచ్చారు.

అక్కయ్యగారు ఆకులకు సున్నం రాచి - వక్కపొడి అందులో ఉంచి ఆయన చేతికిచ్చారు.

ఆయన వాటిని నాకు అందిస్తూ "శర్మగారూ! ఆకులు లేతగా లేవూ?" అన్నారు.

"లేత తమలపాకులు వెదికి తేవడంలో మీకు మీరే సాటి" అన్నాను.

భార్యాభర్తల సంబంధాన్ని- అందుకే కామోసు - ఆకువక్కలతో పోల్చాడొక జానపదకవి అనుకున్నాను నాలో నేను. *


## WANTED MODELS

A leading Advertising Agency Invites Applications with PHOTOGRAPHS from MALE and FEMALE MODELS for REGISTRATION with complete BIO - DATA and stating previous MODELLING EXPERIENCE if any :

Write to : P. B. No. 293
G. P. O.
HYDERABAD - 500 001